## క్లుప్తంగా

### గ్రామాల్లో బడిబాట


ప్రచారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

**రాయికల్:** పట్టణంతోపాటు మండలంలోని ఒడ్డెరకాలనీ, చెర్లకొండాపూర్‌లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను చేర్పించాలంటూ పాఠశాలల్లో సౌకర్యాలపై వివరించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజశేఖర్, చెరుకు మహేశ్వరశర్మ, ప్రశాంత్, పద్మ, తరంగిని, ఏనుగు రజిత పాల్గొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**మెట్‌పల్లిరూరల్:** మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మారు సాయిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

### అయ్యప్ప ఆలయానికి ఆవు


ఆవును అప్పగిస్తున్న మోక్షిత్

**కోరుట్లటౌన్:** పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయానికి మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన మల్లాపూర్ మోక్షిత్ ఒక ఆవును అందజేసినట్లు ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ గురువారం తెలిపారు. మోక్షిత్ తన తండ్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం గోశాలలో రూ.5,116 చెల్లించి ఒక ఆవును కొనుగోలు చేసి అందించారని పేర్కొన్నారు. గోశాలలో ఉన్న ఆవుల ఆహారం కోసం ఒక నెల ఖర్చు రూ.3,516 అవుతోందని, దాతలు ముందుకు రావాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాములపల్లిలో ఉచిత వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిప్రణీత

**పెగడపల్లి:** రాములపల్లి గ్రామంలో గురువారం జగిత్యాలకు చెందిన సాయిరాం పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన రాచర్ల పెద్ద మల్లయ్య స్మారకార్థం దీకొండ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ సాయిప్రణీత పాల్గొని చిన్నారులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. వర్షాకాలం సీజన్‌లో సక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎస్సై రామకృష్ణ, నంచర్ల విండో మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి శివ, స్థానికులు పాల్గొన్నారు.

### అల్లీపూర్ విద్యార్థిని ఔదార్యం


ఆర్థిక సాయం అందజేస్తున్న చైత్ర

**రాయికల్:** తన తల్లిదండ్రులు ఖర్చుల కోసం డబ్బులిస్తే.. పాఠశాల అభివృద్ధి కోసం తనవంతుగా రూ.2వేల ఆర్థిక సాయాన్ని ఉపాధ్యాయులకు అందించి తన ఔదార్యాన్ని చాటుకుంది ఓ చిన్నారి. అల్లీపూర్ హైస్కూల్‌లో 8వతరగతి చదువుతున్న దండవేని చైత్ర తాను దాచుకున్న డబ్బులను పాఠశాల అభివృద్ధికి అందించడంతో ఉపాధ్యాయులు అభినందించారు.

### ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

**జగిత్యాలటౌన్:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 15న ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి బింగి సత్యమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఏడు బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని, డిగ్రీ విద్యార్హత, టూవీలర్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైనవారు జిల్లాలోనే పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గలవారు 15న ఉదయం 10.30 గంటల కలెక్టరేట్‌లోని రూం నంబర్ 218లో నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

**ధర్మపురి:** మేత కోసం వెళ్లిన గేదె గురువారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందింది. తన గేదె విలువ రూ.70వేలుంటుందని దమ్మన్నపేట గ్రామానికి చెందిన మడిపెల్లి తిరుపతి తెలిపాడు.

# అద్దె భవనంలో గ్రంథాలయం


అద్దె భవనంలో రాయికల్ గ్రంథాలయం


లైబ్రరీలో ఉన్న పాత పుస్తకాలు

- పక్కా భవనం నిర్మించేదెప్పుడో..
- నిధులున్నా.. స్థలం కోసం అన్వేషణ

**రాయికల్:** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయి. కానీ రాయికల్ పట్టణంలోని గ్రంథాలయంలో మాత్రం నిరుద్యోగులకు సంబంధించి పోటీ పరీక్షలకు ఎలాంటి మెటీరియల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ 25కిలోమీటర్ల దూరంలో ఉన్న జగిత్యాల జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయికల్ పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి రాయికల్ పట్టణంలోని తహసీల్ కార్యాలయం సమీపంలో ఓ అద్దె భవనంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ లేకపోవడంతోపాటు కుర్చునేందుకు కుర్చీలు, ఇతర వస్తువులు సైతం లేకపోవడంతో కేవలం దిన పత్రికలు చదివేందుకు వచ్చి వెళ్తున్నామని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**8 శాతం..**

రాయికల్ పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో ఇంటి పన్ను రూపంలో వసూలు చేస్తుండగా.. అందులోంచి 8 శాతం గ్రంథాలయ వసతుల కల్పన కోసం కేటాయిస్తున్నారు. కేవలం రాయికల్ పట్టణంలో ప్రతి ఏటా రూ.కోటి వరకు ఇంటి పన్ను వసూలు కాగా, అందులోంచి రూ.80వేల వరకు లైబ్రరీకి కేటాయిస్తున్నారు. మండలంలోని 32 గ్రామాల్లో ప్రతి సంవత్సరం రూ.కోటి నుంచి రూ.2కోట్ల వరకు ఇంటి పన్ను వసూలవుతుండగా.. ప్రతి ఏటా గ్రంథాలయం కోసం రూ.2లక్షల వరకు కేటాయిస్తున్నారు. అయినా గ్రంథాలయంలో అరకొర వసతులతో నిరుద్యోగులు, పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి రాయికల్ పట్టణంలో గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

#### దిన పత్రికలు చదివి వెళ్తున్నాం



రాయికల్ పట్టణంలోని లైబ్రరీకి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు వెళ్తే ఎలాంటి మెటీరియల్స్ లేవు. కేవలం దిన పత్రికలు చదివి మాత్రమే వెళ్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని రకాల మెటీరియల్స్ అందుబాటులో ఉండేలా చొరవ చూపాలి.

– మామిడాల మహేశ్, ప్రైవేట్ టీచర్

#### స్థలం లేదు



రాయికల్ పట్టణంలో గ్రంథాలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. స్థలం లేకపోవడంతో అద్దె భవనంలోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. స్థలం చూపిస్తే పక్కా భవనాన్ని నిర్మిస్తాం.

– రఫీ, లైబ్రేరియన్

## అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

- జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు లేఖ అందిస్తున్న జీవన్‌రెడ్డి

**జగిత్యాలటౌన్:** జిల్లాకేంద్రంలోని నాలుగో వార్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో యాస్మిన్ బాషాను కలిసి లేఖ అందించారు. బైపాస్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, టౌన్ ప్లానింగ్ విభాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. నిబంధనల మేరకు లేకుంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**బీఈడీ చేసిన వారికి అవకాశం కల్పించాలి**

ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో బీఈడీ చేసిన వారిని కూడా పరిగణనలోకి తీసుకునేలా చూడాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. ఇంటర్, డీఈడీ ఉన్నవారిని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్టులకు పరిగణనలోకి తీసుకుని సీనియారిటీ లిస్ట్ తయారు చేయాలని ఉత్తర్వులు ఇచ్చారని, బీఈడీ అర్హత ఉన్నవారికి పీఎస్ హెచ్‌ఎం ప్రమోషన్ ఇవ్వకూడదని ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. స్పందించిన జీవన్‌రెడ్డి సమస్యను విద్యాశాఖ ఉన్నతాధికారులు, సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్లో వివరించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు బోనగిరి దేవయ్య, ఎన్నం రాంరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, బైరం హరికిరణ్, కొక్కుల రాంచంద్రం, ఒడ్నాల రాజశేఖర్, ఆనందరావు, గుర్రం శ్రీనివాస్, మచ్చ శంకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**తాగునీటి ఎద్దడి నివారణకు కృషి**

**రాయికల్:** గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుమ్మరిపల్లిలో మంచినీటి బావి మరమ్మతుకు ఇటీవల నిధులు కేటాయించారు. ఆ పనులను గురువారం ఎమ్మెల్సీ పరిశీలించారు. ఆయన వెంట గ్రామస్తులు గుమ్మడి భూమయ్య, గుమ్మడి సంతోష్, నాగిరెడ్డి తిరుపతి, బొప్పారపు భూమయ్య, సూర జగన్ పాల్గొన్నారు.

### రోడ్డు పునరుద్ధరణ



**సారంగాపూర్:** బీర్‌పూర్ మండలం రేకులపల్లి–నెదునూర్ గ్రామాల మధ్య తెగిపోయిన రోడ్డుకు ఎట్టకేలకు గురువారం అధికారులు మరమ్మతులు పూర్తి చేశారు. మూడు సంవత్సరాల క్రితం గోదావరి తీరం వెంట వచ్చిన వరదల కారణంగా రేకులపల్లి–నెదునూర్ గ్రామాల మధ్యన ఉన్న రోడ్డు, వంతెన కొట్టుకుపోయింది. ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఈ రెండు గ్రామాలకు వచ్చిన సమయంలో ఆయా గ్రామాల ప్రజలు సమస్యను విన్నవించారు. ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్(ఎఫ్‌డీఆర్) నిధుల కింద రూ.10లక్షలు విడుదల చేయడంతో.. రోడ్డుకు, మధ్యన ఉన్న వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేశారు. ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పేద విద్యార్థినికి చేయూత


విద్యార్థిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

**సారంగాపూర్:** తల్లి, తండ్రి లేని ఓ విద్యార్థినికి హైదరాబాద్‌కు చెందిన శ్రీమేధా ట్రస్టు ఆరు సంవత్సరాలపాటు ఉన్నత చదువులు చదివించడానికి ఎంపిక చేసింది. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గుండ నందిని తల్లిదండ్రులు మయూరి–రేణు తన చిన్నప్పుడే మృతిచెందడంతో నానమ్మ పెంచి పెద్ద చేసింది. బీర్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన నందిని పదోతరగతిలో 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. హైదరాబాద్‌లోని శ్రీమేధా ట్రస్టు ద్వారా పైచదువులకు సాయం పొందడానికి ఇటీవల నిర్వహించిన ప్రతిభా పరీక్షలో రాష్ట్రస్థాయిలో వేలాది మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. జగిత్యాల జిల్లా కేంద్రంలో 4వేల మంది విద్యార్థులు పరీక్ష రాశారు. శ్రీమేధా వారు నిర్వహించిన పరీక్షలో గుండ నందిని రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. శ్రీమేధా ట్రస్టు ఆరు సంవత్సరాలపాటు ఉచితంగా చదివించడానికి ఎంపిక కావడంతో.. ట్రస్టు వారు హైదరాబాద్‌లోని క్షేత్ర ఇంటర్ కళాశాలలో అడ్మిషన్ ఇప్పించారు. బీర్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నందినిని ఘనంగా సన్మానించారు. బీర్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సంగెనభట్ల నర్సింహ్మమూర్తి రూ.5,116, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ కలిసి రూ.4వేలు, చిట్నేని వసంత, అంగన్‌వాడీ టీచర్లు కలిసి మరో రూ.2,100 నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.

## విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ


ధర్మపురి: యూనిఫాంలు, పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

**ధర్మపురి:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు గురువారం పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. బుగ్గారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలతోపాటు నాణ్యమైన విద్యనందిస్తోందని ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మనూష, సీఆర్పీ పురుషోత్తం, ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

**సారంగాపూర్:** బీర్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను గురువారం పంపిణీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను తయారు చేసి అందించిన మహిళా సంఘాల సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఏపీడీ చరణ్‌తేజ, ఎంపీడీవో లచ్చాలు, డీపీఎం వెంకటేశం, హెచ్‌ఎం సంగెనభట్ల నర్సింహ్మమూర్తి, మహిళా సంఘాల సభ్యులు, సముద్రాల శ్రీలత పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాలలో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య


పదోతరగతి గదిలో ఏడుగురు విద్యార్థులు

**రాయికల్:** పట్టణంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులున్నా.. విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. పాఠశాలలో 6 నుంచి 10వతరగతి వరకు ఉండగా.. కేవలం 41 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు 9 మంది ఉండాల్సి ఉండగా.. ఇందులో ఉర్దూ, సాంఘిక, ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉండి ఉన్న ఆరుగురిపైనే పనిభారం పెరుగుతోంది. దీంతో విద్యార్థుల సంఖ్య సైతం తగ్గుతోంది. 6వతరగతిలో 9, 7వతరగతిలో 14, 8వతరగతిలో ఆరుగురు, 9వ తరగతిలో ఐదుగురు, 10వతరగతిలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించినా విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

#### పెంచేందుకు కృషి



మా పాఠశాలలో కేవలం ఉర్దూ మీడియమే ఉండటంతో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్న 41 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నాం.

– నసీర్ అహ్మద్, ప్రిన్సిపాల్

### దరఖాస్తులు ఆహ్వానం

**జగిత్యాల:** యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోగల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజనాభివృద్ధి అధికారి నీలిమ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆబ్జెక్ట్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుందని, వార్షికాదాయం రూ.3 లక్షలకు మించరాదని, ఈనెల 30 వరకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

**ధర్మపురి:** మగ్గిడి ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలిపారు. హిందీ, గణితం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హిందీ పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు డిగ్రీతోపాటు హెచ్‌పీటీ, గణితం పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు పీజీతోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు.

### వ్యక్తిపై కేసు

**రాయికల్:** ధర్మాజీపేట గ్రామానికి చెందిన గుగ్లావత్ చిరంజీవి ఎక్సైజ్ అధికారులను దూషించడంతో కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్సై అజయ్ తెలిపారు. ఈనెల 13న పాత నేరస్తుల విషయంలో బైండోవర్ చేయడానికి ధర్మాజీపేట గ్రామానికి ఎక్సైజ్ అధికారులు వెళ్లారు. గుగ్లావత్ చిరంజీవి ఎక్సైజ్ అధికారులను దూషించడంతోపాటు విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ఘన సన్మానం

**మల్లాపూర్:** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో పని చేసిన రాజు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం మండల ఐకేపీ ఏపీఎం దేవరాజు ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. సీసీ శ్రావంతి, లక్ష్మణ్, వీవోఏలు పాల్గొన్నారు.


మేడిపల్లి: అమ్మవారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్


జగిత్యాలటౌన్: పాల్గొన్న భోగ శ్రావణి తదితరులు

## ఘనంగా బోనాల మహోత్సవం

**మేడిపల్లి:** పొరుమల్ల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. నరేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మాదం వినోద్, గడ్డం జలందర్‌రెడ్డి, సాయిని గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తేనెటీగల దాడి**

భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామంలో పెద్దమ్మ బోనాల జాతరలో అపశ్రుతి చోటుచేసుకుంది. భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. దాంతో కాసేపు గ్రామంలో గందరగోళం నెలకొంది.

**గ్రామ దేవతలకు బోనాలు**

**రాయికల్:** రాయికల్ మండలం ఆలూరులో గురువారం గ్రామ దేవతలకు మహిళలు బోనాలు చేశారు. ముందుగా శోభాయాత్ర చేపట్టారు. దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భాస్కర్‌రావు, మెక్కొండ రాంరెడ్డి, రాజేశ్ యాదవ్, సురేందర్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

**అర్బన్ కాలనీలో..**

**జగిత్యాలటౌన్:** పట్టణ నూకపెల్లి అర్బన్ డబుల్ బెడ్‌రూం కాలనీ మహిళలు పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణి గురువారం కాలనీ మహిళలతో కలిసి పోచమ్మ తల్లికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణి మాట్లాడుతూ.. పోచమ్మ తల్లి అనుగ్రహంతో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, భానుప్రియ, సింగం పద్మ పాల్గొన్నారు.

**కథలాపూర్:** ఇప్పపెల్లి, తక్కళ్లపెల్లి, తాండ్య్రాల గ్రామాల్లో గురువారం పెద్దమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో గ్రామం నుంచి దేవాలయం వరకు వెళ్లారు. దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వన భోజనాలు చేశారు. గ్రామ కమిటీ ప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..**

**ధర్మపురి:** నేరెల్ల గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రామ దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. సంఘ సభ్యులు బ్యాండుమేళాలు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సంఘం అధ్యక్షుడు జాజాల రమేశ్, జాజాల శంకర్, పాదం చంద్రయ్య, కరవత్తుల నాగరాజు తదితరులున్నారు.


రాయికల్: బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


ఇప్పపెల్లిలో..


నేరెల్లలో..

### సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

**కోరుట్ల:** రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ హైదరాబాద్‌ను కోరుతూ కోరుట్ల బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల అడిషనల్ కలెక్టర్ రాంబాబుకు వినతి పత్రం సమర్పించారు. 2024 మే నెల వేతనం వెంటనే విడుదల చేయాలని కోరారు. రూ.18,000 ఫిక్స్ వేతనం ఇవ్వాలని, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నీలాదేవి, కోశాధికారి గంగమణి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే


రోగితో మాట్లాడుతున్న సంజయ్

**మెట్‌పల్లి:** పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని గురువారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల గురించి వైద్యులనడిగి తెలుసుకున్నారు. రోగులను కలిసి వైద్య సేవలు, డైట్ గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. మెరుగైన వైద్యం అందించడానికి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి


చిన్నారులను కేంద్రాలకు తీసుకెళ్తున్న టీచర్లు

**జగిత్యాల:** ప్రతి ఒక్కరూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అంగన్‌వాడీ టీచర్లు దయావతి, యతీశ్వరి కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాల్లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పారు. శారీరక అభివృద్ధి కోసం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి విద్యాబోధన అందిస్తామన్నారు. ప్రీస్కూల్ విద్యతోపాటు పౌష్టికాహారం సైతం ఇస్తామని అన్నారు. టీచర్లు నీలవేణి, రజిని, కళావతి, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

### లాసెట్ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

**ధర్మపురి:** లాసెట్ పరీక్ష ఫలితాల్లో ధర్మపురిలోని మైనార్టీ బాలికల కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సంజీదబాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, ఎల్‌ఎల్‌బీలో ప్రవేశం కోసం పరీక్ష రాయగా.. శిరీష 764, కావ్యశ్రీ 1599, అయోషా సిద్దికా 1931, అమూల్య 3798 ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా అభినందించారు.

### 3, 10 తరగతుల ప్రవేశాలకు లక్కీడ్రా

**జగిత్యాల:** గిరిజన సంక్షేమ శాఖలో జిల్లాలో 2024–25 విద్యాసంవత్సరానికిగాను బెస్ట్ అవలేబుల్ స్కూల్ పథకంలో గిరిజన విద్యార్థులకు 3, 10 తరగతుల ప్రవేశాల కోసం ఎంపిక చేశామని గిరిజనాభివృద్ధి అధికారి నీలిమ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, డీఈవో జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో లక్కీడ్రా తీశామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల : రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899